అతను ప్రక్కనుండి కనపడే ఆ అమ్మాయి వొంపు సొంపుల వయ్యారాలను కళ్ళతో తాగుతూ ఆ వయసు లహరికి, అయస్కాంతానికి ఇనుపరజను అతుక్కుపోతున్నట్లుగా అయిపోతున్నాడు.

"మిమ్మల్నే, సాగర్ నేనూ వెళుతున్నాను. నాకు సాగర్ తెలియదు. మా అన్నయ్య అక్కడ వున్నాడు అందుకని అడిగాను"

"సాగర్ మావూరె. బై దిబై. మీ పేరు?–" అందా చిలక.

"వేణు. మీపేరు కోకిలా?"

ఆమె నవ్వింది. "కాదు"

"లావణ్యా? మీ గొంతునుబట్టి, లేదా మీ శరీరాన్నిబట్టి "లావణ్య" అయినా అయివుండాలి అనుకున్నాను."

"హద్దులు మీరుతున్నారు మీరు. మన పరిచయం ఇప్పుడేఅయింది.

"అవును మనం ఇప్పుడే హైదరాబాదు సరిహద్దులు దాటుతున్నాం"

"ఓ.కే" అని సీటు వెనక్కువాలి నిద్రకోసం ప్రయత్నించసాగింది.

వేణు మనసుని ఆమె సౌందర్యం, గోపికలనలరించినవేణుగానంలా అలరిస్తూంది.

ఇబ్రహీంపట్నంలో "కూల్ డ్రింక్" అందిస్తూ-

మల్లేపల్లిలో "చాయ్" అందిస్తూ....

"లావణ్య స్పర్శానుభూతిని పొందాడు. ఆమె కొనగోళ్ళు తగిలినప్పుడల్లా మేగ్నెటిక్ యాక్షన్‌లా తల్లడిల్లిపోయాడు వేణు.

సాగర్ దగ్గర పడుతోంది. ఆకాశంలో తారకల్లా మూడు కాలనీల్లో లైట్లు మిలమిలా మెరుస్తున్నాయి. బస్సులో లైట్లు వెలిగాయి. లావణ్యా నిద్రలో అస్పష్టంగా సీట్లో ఊగుతూంది. తొలగిన పైట చాటున, తెల్లగా, పాలమీగడ నురుగులా మెరిసిపోతున్న ఆమె శరీరం, ఆ సోయగం ఎవడు సొంతం నసుకుంటాడోనని, అసూయపడసాగాడు వేణు.

ఆఫీసర్స్ క్లబ్ దగ్గర ఆగింది బస్. వేణు చేతిలో ఒక స్లిప్‌పెట్టి దిగిపోయింది లావణ్య.

"మా ఇంటినెంబరు ఇది. రేపు సాయంత్రం ఒక్కరూ రండి. లావణ్య"

వేణుకు బోయింగ్ 737లో వెళుతున్నట్లుగా వుంది. బస్సుదిగి తన అన్నయ్య ఇంటికివెళ్ళి, లావణ్యని ఊహల్లో పొందుపరచుకుని నిద్ర పోయాడు.

తెల్లవారింది.

ఆ సాయంత్రం వరకు ఎలాగడిపాడో వేణుకు తెలియదు. క్వార్టర్స్‌వేపు బయలుదేరాడు. ఒకో క్వార్టర్ నంబర్ చూసుకుంటూ నడవ సాగాడు. ఐదు క్వార్టర్స్ దాటితే ఆమె యిల్లు వస్తుంది.

అరె! ఎర్రటి బోర్డు వుందేమిటి? బహుశః వాళ్ళ నాన్నగార్కి ఎర్రనిరంగంటే ఇష్టం అయివుండచ్చు.

ఆ క్వార్టర్ దగ్గరగా వెళ్ళేడు.

ఆ క్వార్టరు పోలీస్ అవుట్ పోస్ట్! యూనిఫారంలోవున్న కాని స్టేబుల్‌ని చూసి, తడబడి, వేణు వెంటనే వెనుదిరగడం తప్పితే ఇంకేం చేయగలడు?

....0....

# చలన చిత్రం

ఆంధ్రదేశంలో అది ఒక సినిమా హాలు. ఆ హాలులో ఆంధ్రలో తిరుగులేని కథానాయకుడిగా పేరొందిన నటుడు నటించిన 'కట్టెపట్టిన వీరుడు' ఆడుతోంది. ఇదేమిటి 'కత్తి పట్టిన వీరుడు' కాకుండా ఈ 'కట్టె' ఏమిటని మీరు ఆశ్చర్యపోవద్దు. ఆ సినిమాలో హీరో చేతిలో ఒక పొడుగాటి 'కర్ర' కత్తికంటె, ఇనుప రాడ్‌కంటె బలంగా తయా రవుతుంది. అదేం చిత్రమో దానితో కొన్ని వందల మందిని హత మారుస్తాడు. ఎదుటి వాళ్లు కూడా అతన్ని చావ చితకకొడతారు. అయినా హీరోగార్కి క్రాఫ్ కూడా చెదరదు. దానితో లారీలు, చివరికి రైలింజను కూడా తుక్కు తుక్కు. సదరు సినిమా హౌస్ ఫుల్ కలెక్షన్స్‌తో నడుస్తోంది.